JAYABHERIDAILY.COM
ప్రభాత
# జయభేరి
తెలుగు దినపత్రిక
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
మేడ్చల్ - మల్కాజిగిరి । గురువారం 30-10-2025
Medchal - Malkajgiri । Thursday 30-10-2025
jayabherinews
సంపుటి : 02 । సంచిక : 153 । పేజీలు : 8 । వెల : 5
Vol. 02 । Issue 153 । Pages : 8 । ₹: 5

విలేకర్లు కావలెను
మీకు జర్నలిజంలో ఆసక్తి ఉందా?
సమస్యల్ని ప్రశ్నించేందుకు సరైన అస్త్రం కోసం ఎదురు చూస్తున్నారా?
మీకు అవకాశం కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..!
ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ..
డిజిటల్ మీడియా రంగంలో సరికొత్త హంగులతో మీ అరచేతిలో...
"జయభేరి" తెలుగు దినపత్రిక.. నీకో చక్కని వేదికగా నిలుస్తుంది...
9391 544 889
call me
jayabheripaper@gmail.com


## కష్టకాలంలో బాధితుల కోసం పని చేసిన
# ప్రతి ఒక్కరికీ అభినందనలు

- తుఫాన్ కారణంగా ఇద్దరు చనిపోయారు
- వరద ప్రభావిత ప్రాంతాల్లో చేపట్టాల్సిన చర్యలపై అధికారులు, మంత్రులకు పలు సూచనలు
- సచివాలయాలపై మైక్ అనౌన్స్మెంట్ సిస్టంను ఏర్పాటు
- జిల్లా కలెక్టర్లు, అధికారులు, మంత్రులతో సీఎం చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్





జయభేరి, అమరావతి :

మొంథా తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లోని బాధితులకు నిత్యావసర సరుకులు అందించాలని సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశించారు. బుధవారం నాడు అయన జిల్లా కలెక్టర్లు, అధికారులు, మంత్రులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. తుఫాన్ నష్టం అంచనాలను త్వరితగతిన సిద్ధం చేయాలని సూచించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో చేపట్టాల్సిన చర్యలపై అధికారులు, మంత్రులకు పలు సూచనలు చేసారు. టెలీ కాన్ఫరెన్సులో ముఖ్యమంత్రి మాట్లాడుతూ గత నాలుగైదు రోజుల నుంచి మొంథా తుఫాన్ విషయంలో సమర్థవంతంగా వ్యవహరించి నష్టనివారణ చర్యలు చేపట్టాం. సీఎం నుంచి సచివాలయం సిబ్బంది వరకు జిల్లా అడ్మినిస్ట్రేషన్తో సహా అంతా కలిసి టీమ్ గా పనిచేశాం. కష్టకాలంలో బాధితుల కోసం పని చేసిన ప్రతి ఒక్కరికీ అభినందనలు. మరో రెండు రోజులు ఇదే విధంగా పని చేస్తే...

...మిగతాది 2 లో



## రైతులకు నష్టం వాటిల్లకుండా
# తగిన జాగ్రత్తలు

- ధాన్యం కొనుగోళ్లు కేంద్రాలలో తగిన ఏర్పాట్లు
- అధికారులు, సిబ్బంది అప్రమత్తం గా వుండాలి
- తుఫాన్ ప్రభావంపై సీఎం రేవంత్ సమీక్ష

జయభేరి, హైదరాబాద్ :

మొంథా తుపాన్ ప్రభావంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆరా తీశారు. వరి కోతల సమయం కావడంతో పాటు పలు చోట్ల కళ్లాల్లో ధాన్యం ఆరబోసిన నేపథ్యంలో రైతులకు ఎటువంటి నష్టం వాటిల్లకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ధాన్యం, పత్తి కొనుగోలు కేంద్రాల్లోనూ తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. ఉమ్మడి ఖమ్మం, ఉమ్మడి వరంగల్, ఉమ్మడి నల్గొండ జిల్లాల్లో మొంథా తుపాన్ ప్రభావం అధికంగా ఉండగా, హైదరాబాద్ సహా ఇతర జిల్లాల్లోనూ భారీ వర్షాలు కురుస్తుండడంతో అన్ని శాఖల అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ జంక్షన్లో గోల్కొండ ఎక్స్ప్రెస్, గుండ్రాతిమడుగు స్టేషన్లో కోణార్క్ ఎక్స్ప్రెస్ నిలిచిపోవడంతో పలు రైళ్లను దక్షిణ మధ్య రైల్వే అధికారులు దారిమళ్లించిన నేపథ్యంలో ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని చెప్పారు.

...మిగతాది 2 లో



## కట్టు.. బొట్టు
# మార్చిన కవిత

- జయలలిత స్ఫూర్తితో కొత్త ఇమేజ్..?
- సాఫ్ట్ లీడర్ ఇమేజ్ను ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం
- మహిళా ఓటు బ్యాంకులో బలమైన సెంటిమెంట్ను క్రియేట్ చేయాలనే ఉద్దేశం

జయభేరి, హైదరాబాద్, అక్టోబరు 29:

తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ కుమార్తె.. కల్వకుంట్ల కవిత బీఆర్ఎస్ నుంచి బయటకు వెళ్లిన తర్వాత.. రాజకీయంగా తన శైలిని మార్చుకున్నారు. ఆమె కట్టుబొట్టు, పబ్లిక్ అప్పియరెన్స్ జయలలితను పోలి ఉన్నాయనే చర్చ నడుస్తోంది. గెలుపే లక్ష్యంగా బలమైన మహిళా నాయకురాలిగా నిలదొక్కుకునేందుకు ఆమె ఈ వ్యూహాత్మక అడుగులు వేసినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. జాగృతి జనం బాట యాత్రలో పాల్గొంటూ.. మహిళా సాధికారత, బీసీ రాజ్యాధికారం అంశాలను ప్రధానంగా ప్రస్తావిస్తున్నారు. ఇది ఆమె రాజకీయ భవిష్యత్తుకు కొత్త కోణాన్ని ప్రతిబింబిస్తోంది.మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కుమార్తె కవిత .. బీఆర్ఎస్ నుంచి బయటకు వచ్చిన తర్వాత తన రాజకీయ పయనాన్ని కొత్త కోణంలో ప్రారంభించారు. ఆమె ప్రస్తుత కట్టు, బొట్టు శైలి.. ప్రజా సమక్షంలో ఆమె ఆహార్యం చూస్తుంటే.. తమిళనాడు రాజకీయ

...మిగతాది 2 లో

## ఓటేయాలనే ఉత్సాహం
# ఎవ్వరిలోనూ కనిపించడం లేదు

- బోనస్ లేదు.. పెట్టుబడి సాయం లేదు.. విత్తనాలు లేవు.. ఎరువులు లేవు
- భార్యకు ఫ్రీ ఇచ్చి.. భర్త నుంచి ఆ డబ్బులు లాక్కుంటున్నారు
- తులం బంగారం ఇచ్చే బాపతు కాదని మేం ముందే చెప్పాం

జయభేరి, హైదరాబాద్ :

తెలంగాణ భవన్ లో జరిగిన మున్నూరు కాపు ఆత్మీయ సమ్మేళనంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొన్నారు. కేటీఆర్ మాట్లాడుతూ రెండేళ్ల నుంచి రాష్ట్రంలో అహనా పెళ్లంట సినిమా నడుస్తోంది. ఆ సినిమా తరహాలోనే కోడిని చూపించి.. అదే చికెన్ బిర్యాని. ఆ కోడి పేరే ఆరు గ్యారెంటీలు. నిన్న యూసఫ్గూడకు వెళ్లారు.. అదేదో పిలిచినట్లే రేవంత్ రెడ్డి అక్కడికి వెళ్లారు. మన సన్మానం మనమే చేపించుకోవడం అంటే అదే. నేను చెప్పిన ప్రతిమాట నిలబెట్టుకుంటా అని నేనేమి చెప్పట్లేదు అని ఆ మీటింగ్ చివర్లో రేవంత్ రెడ్డే చెప్పేశారు. కాంగ్రెస్కు ఓటేయాలనే ఉత్సాహం ఎవ్వరిలోనూ కనిపించడం లేదు. రాష్ట్రంలో ధాన్యం పత్తి కొనుగోలు చేసే పరిస్థితే లేదు. బోనస్ లేదు.. పెట్టుబడి సాయం లేదు.. విత్తనాలు లేవు.. ఎరువులు లేవు. ఎరువుల కోసం లైన్లో నిలబడి రైతు చనిపోయిన పరిస్థితి కూడా చూశామని అన్నారు. రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని నిరుద్యోగులను కూడా మోసం చేశారు. మంత్రులు అబద్ధాలు చెబితే కనీసం అతికేటట్లు కూడా లేవు. మొత్తం మీద ఇప్పటి వరకు ఇచ్చినవి ఆరు, ఏడు వేలు కూడా లేవు.



యువతులకు స్కూటీ అన్నారు.. మహిళలకు నెలకు రూ.2500 ఇస్తామని మాట తప్పారు. ఈ పైసలు ఎక్కడికి పోయాయని మహిళలు ఎదురు చూస్తున్నారు. ఫ్రీ బస్ అని చెప్పి మహిళలకు ఫ్రీ ఇచ్చి.. పురుషులకు రేట్లు పెంచారు. భార్యకు ఫ్రీ ఇచ్చి.. భర్త నుంచి ఆ డబ్బులు లాక్కుంటున్నారు. తులం బంగారం ఇచ్చే బాపతు కాదని మేం ముందే చెప్పాం.. అదే నిజమైంది. ఇందిరమ్మ రాజ్యం అని ఒక్క ఇల్లు కట్టలేదు కానీ.. వేలాది ఇళ్లు మాత్రం కూల్చేశారు. పెద్దల ఇల్లు కనిపించవు.. రేవంత్ రెడ్డి అన్న ఇల్లు కనిపించదు.. పేదల ఇల్లు కూలగొట్టేశారు. ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలంటే జూబ్లీహిల్స్లో బీఆర్ఎస్ను గెలిపించాలని అన్నారు.




# బీహార్ లో చావో రేవో...

జయభేరి, పాట్నా, అక్టోబరు 29:

బీహార్ లో ఏ పార్టీ గెలుస్తుంది? ఎన్డీఏ తిరిగి అధికారంలోకి వస్తుందా? లేకుంటే మహాఘట్ బంధన్ విజయాన్ని కైవసం చేసుకుంటుందా? ఎన్డీఏ గెలిస్తే ఏమవుతుంది? ఓడిపోతే ఏం జరగనుంది? బీహార్ ఎన్నికలు ఏపీ పై ఎలాంటి ప్రభావం చూపుతాయి? ఇప్పుడు ఏపీ పొలిటికల్ సర్కిల్లో ఇదే చర్చ నడుస్తోంది. ఏపీ సీఎం చంద్రబాబు ఎన్డీఏ తరపున బీహార్లో ప్రచారానికి వెళ్తానని చెప్పారు. ఎన్డీఏ లో కీలక భాగస్వామి కావడంతో కేంద్ర పెద్దల పిలుపుమేరకు ఆయన బీహార్ ప్రచారానికి వెళ్ళనున్నారు. ఢిల్లీలో చంద్రబాబు ప్రచారం చేశారు. అక్కడ బిజెపి విజయం సాధించింది. అందుకే చంద్రబాబును బిజెపి పెద్దలు ప్రచారానికి పిలిచినట్లు తెలుస్తోంది. మరోవైపు బీహార్ సీఎం నితీష్ కుమార్ తో సైతం చంద్రబాబుకు మంచి సంబంధాలు ఉన్నాయి.బీహార్లో నువ్వా నేనా అన్నట్టు పరిస్థితి ఉంది. ఎన్డీఏ వర్సెస్ మహా ఘుట్ బంధన్ గట్టిగానే తలపడుతున్నాయి. ప్రస్తుతానికి చూస్తే మహా ఘుట్ బంధన్ దూకుడు మీద ఉంది. ఆ కూటమిలో కీలక భాగస్వామిగా ఆర్జెడి ఉంది. కాంగ్రెస్ అధినాయకుడు రాహుల్ గాంధీ బీహార్ పై ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. గత 15 రోజులుగా బీహార్లో విస్తృత ప్రచారం చేశారు. మరోవైపు ఆర్ జెడి నేత తేజస్వి యాదవ్ యువతను తన వైపు తిప్పుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఒక విధంగా చెప్పాలంటే మహాఘట్ బంధన్ గట్టిగానే పోరాటం చేస్తోంది.

...మిగతాది 2 లో

2 విలువలు గాలికి.. కాసులు తమ జేబుల్లోకి..!?

3 ఏసిబీకి చిక్కిన దేవాదాయ ధర్మాదాయ శాఖ ఇంచార్జి

▶▶ మొదటిపేజీ తరువాయి

## రైతులకు నష్టం వాటిల్లకుండా తగిన జాగ్రత్తలు

తుపాన్ ప్రభావం అధికంగా ఉన్న జిల్లాల్లో ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు సమన్వయంతో పనిచేయాలని, జిల్లా కలెక్టర్లు ఆయా బృందాలకు తగిన మార్గదర్శకత్వం వహించాలని సూచించారు. వాగులు, వంకలు పొంగే ప్రమాదం ఉన్నందున జిల్లా అధికారులు అప్రమత్తంగా ఉండి, లోతట్టు ప్రాంతాల కుటుంబాలను సహాయక శిబిరాలకు తరలించాలన్నారు.నీటి పారుదల శాఖ అధికారులు, సిబ్బంది రిజర్వాయర్లు, చెరువులు, కుంటల నీటి మట్టాన్ని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, నీటి విడుదలపై ముందుగానే కలెక్టర్లకు మరియు క్షేత్రస్థాయి సిబ్బందికి సమాచారం ఇవ్వాలని ముఖ్యమంత్రి గారు ఆదేశించారు. పూర్తిగా నిండిన చెరువులు, రిజర్వాయర్ల వద్ద ఇసుక బస్తాలను ముందుగానే సిద్ధంగా ఉంచాలన్నారు.రోడ్లపై నీరు నిలిచిన ప్రాంతాల్లో, లో లెవల్ బ్రిడ్జీలు, కాజ్వేలపై నుంచి రాకపోకలను పూర్తిగా నిషేధించాలని, పోలీసులు, రెవెన్యూ అధికారులు వాటి సమీపంలో బారికేడ్లు ఏర్పాటు చేసి పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. తుపాన్ ప్రభావంతో వర్షపు నీరు నిలువ ఉండి దోమలు, ఇతర క్రిమికీటకాలు విజృంభించే అవకాశం ఉన్నందున నగర, పురపాలక, గ్రామ పారిశుద్ధ్య సిబ్బంది ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేపట్టాలని ముఖ్యమంత్రి చెప్పారు.వైద్యారోగ్య శాఖ తగినంత మందులు అందుబాటులో ఉంచుకోవాలని, అవసరమైన చోట్ల వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రాణనష్టం, ఆస్తినష్టం, పశునష్టం చోటుచేసుకోకుండా అన్ని శాఖలు జాగ్రత్తలు వహించాలన్నారు. రెవెన్యూ, విద్యుత్, పంచాయతీరాజ్, ఆర్ అండ్ బీ, వైద్యారోగ్య, పోలీస్, అగ్నిమాపక శాఖలు, ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది సమన్వయంతో పని చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. హైదరాబాద్ నగరంలో ప్రజల నుంచి వచ్చే వినతులకు జీహెచ్ఎంసీ, హైడ్రా, ఎస్డీఆర్ఎఫ్, అగ్నిమాపక శాఖ సిబ్బంది తక్షణమే స్పందించాలని ఆదేశించారు.

## కట్టు.. బొట్టు మార్చిన కవిత

చరిత్రలో అమ్మగా గుర్తింపు పొందిన దివంగత ముఖ్యమంత్రి జయలలితను తలపిస్తుందన్న చర్చ తెలంగాణ రాజకీయాల్లో నడుస్తోంది. ఈ మార్పు కేవలం సౌందర్యానికే పరిమితమా లేక జయలలిత తరహాలో బలమైన మహిళా నాయకురాలిగా తనకంటూ ప్రత్యేక గుర్తింపును సాధించుకునేందుకు వేసిన వ్యూహాత్మక అడుగా.. అన్నది ప్రస్తుతం రాజకీయ విశ్లేషకుల మధ్య ప్రధాన ప్రశ్నగా మారింది.రాజకీయాలలో దృష్టిపరమైన గుర్తింపు ఎంత ముఖ్యమో జయలలిత నిరూపించారు. ఆమె ప్రత్యేకమైన వస్త్రధారణ, బాడీ లాంగ్వేజ్.. ధైర్యంగా మాట్లాడే ధోరణి ఆమెను ఐకాన్‌గా మార్చాయి. తాజాగా 'జాగృతి జనం బాట యాత్ర'లో కవిత కట్టుబొట్టు, పబ్లిక్ ఇంటరాక్షన్ స్టైల్‌ను గమనించినవారు.. ఆమె జయలలిత ఆహార్యాన్ని రీక్రియేట్ చేస్తున్నారని భావిస్తున్నారు. ఈ విజువల్ పాలిటిక్స్ ద్వారా ఆమె ప్రేక్షకుల మనసుల్లో బలమైన నాయకురాలిగా నిలిచిపోవాలనే ప్రయత్నం చేస్తున్నారని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా మహిళా ఓటు బ్యాంకులో బలమైన సెంటిమెంట్‌ను క్రియేట్ చేయాలనే ఉద్దేశంతోనే కవిత ఈ నాయకత్వ శైలిని ఎంచుకున్నారని చర్చ జరుగుతోంది. ఇది మహిళా సాధికారతకు ప్రతీకగా.. సాఫ్ట్ లీడర్ ఇమేజ్‌ను ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నారు.కవిత వేస్తున్న ప్రతి అడుగు.. జనం బాటలో నేరుగా ప్రజలను కలవడం, సాఫ్ట్ స్పీచ్‌తో పాటు విమర్శలు చేయడం.. ఇవన్నీ కూడా 'తాను తిరిగి వచ్చాను.. రాజకీయ ఆట ఇంకా ముగియలేదు' అనే స్పష్టమైన సందేశాన్ని ఇస్తున్నాయి. కవిత తన రాజకీయ ప్రయాణంలో ఇమేజ్ గేమ్‌కే పరిమితం కాకుండా.. బలమైన సామాజిక అజెండాను ఎంచుకున్నారు. ఆమె ప్రధానంగా బీసీల అజెండాను భుజాన వేసుకుంటున్నట్టు కనిపిస్తోంది. రాష్ట్రంలో బీసీల రాజ్యాధికారంపై ఉన్న బలమైన డిమాండ్‌ను ఉపయోగించుకోవాలని చూస్తున్నారు. తన తండ్రి కేసీఆర్‌తో రాజకీయ విభేదాలు వచ్చినా.. అవినీతి ఆరోపణలు ఎదురైనా, తెలంగాణ అస్తిత్వాన్ని , బీసీ వాదాన్ని ప్రచారం చేయడం ద్వారా ప్రజల విశ్వాసాన్ని పొందాలని ప్రయత్నిస్తున్నారు. కవిత గతంలో మహిళా రిజర్వేషన్ల కోసం కృషి చేశారు. ఇప్పుడు ఈ అంశాన్ని మళ్లీ తెరపైకి తీసుకువచ్చి.. బీసీ వాదంతో కలిపి సమపాలనలో ముందుకు తీసుకువెళితే.. మహిళా లోకాన్ని రాజకీయంగా చైతన్యం చేయగలుగుతారని భావిస్తున్నారు. ఏ ఇతర పార్టీలో చేరినా తగిన ప్రాధాన్యత లభించకపోవచ్చు.. అలాగే తండ్రిని విమర్శించాల్సిన పరిస్థితి ఏర్పడవచ్చు. కాబట్టి.. సొంత పార్టీని ఏర్పాటు చేయడం ద్వారా తను అనుకున్న రాజకీయ మార్గంలో వెళ్లడానికి.. రాజకీయ ఉనికిని చాటుకోవడానికి ఇది సరైన మార్గం అని కవిత విశ్వసిస్తున్నట్టు కనిపిస్తోంది. అయితే.. జయలలితకు ఉన్న మాస్ ఇమేజ్ రావాలంటే.. కేవలం కట్టుబొట్టు సరిపోదు, నేరుగా గ్రామీణ ప్రాంతాల్లో పర్యటించి.. ప్రజల కష్టసుఖాలను పంచుకొని, వారికి కొత్త పరిష్కారాలను చూపించగలిగితేనే మాస్ లీడర్‌గా స్థిరపడగలుగుతారని రాజకీయ పండితులు అభిప్రాయపడుతున్నారు. ఏది ఏమైనా.. ఆమె జయలలితను గుర్తు చేసే విధంగా అప్పియరెన్స్ ఉందనడంలో ఎలాంటి సందేహం లేదు.

## కష్టకాలంలో బాధితుల కోసం పని చేసిన ప్రతి ఒక్కరికీ అభినందనలు

బాధిత ప్రజలకు మరింత ఊరట ఇవ్వగలం. తుఫాన్ వెలిసింది కాబట్టి... వీలైనంత త్వరగా సాధారణ పరిస్థితులు నెలకొల్పేలా అధికారులు పని చేయాలని అన్నారు. మంత్రులు, అధికారులు ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించాలి. ప్రభుత్వం ఏం చేసిందో చెప్పాలి.. వారికేమైనా సమస్యలు ఉంటే అడిగి తెలుసుకోవాలి. మొంథా తుఫాను వల్ల వివిధ విభాగాల్లో కలిగిన నష్టాన్ని అంచనా వేయాలి... కేంద్రానికి నివేదిక అందివ్వాలి. తుఫాన్ బాధితులకు నిత్యావసర సరుకులు వెంటనే అందించాలి... నిర్వాసితులను ఆదుకోవాలి. ముందస్తు చర్యలు తీసుకోవడం వల్ల నష్టాన్ని చాలా వరకు నివారించగలిగాం. సచివాలయాలపై మైక్ అనౌన్స్మెంట్ సిస్టంను ఏర్పాటు చేసి కింది స్థాయి వరకూ ప్రభుత్వ ఇచ్చే సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందించాం... ఇదొక నూతన విధానం తీసుకొచ్చాం. తుఫాన్ను ఎవరూ నివారించలేరు... కానీ ముందు జాగ్రత్తలతో నష్టాలను నివారించగలుగతాం. కలెక్టర్లు, అధికారులు కంట్రోల్ రూమ్ లో కూర్చుని రియల్ టైం సమాచారం తెప్పించుకుని జాగ్రత్తలు తీసుకున్నారని అన్నారు. ఎస్డీఆర్ఎఫ్, పోలీస్, ఫైర్ సిబ్బంది బాగా పని చేశారు. చెట్లు కూలినా, విద్యుత్ వైర్లు తెగిపడినా యుద్ధప్రాతిపదికన తొలగించారు. అన్ని మున్సిపాలిటీల్లో డ్రెయిన్లు క్లీన్ చేయడం వల్ల కాలనీలను ముంపుబారిన పడకుండా చేశాం. దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థను కూడా పునరుద్ధరించేందుకు 10 వేలమందిని అందుబాటులో పెట్టుకున్నాం. నేడు మధ్యాహ్నానికి సాధారణ స్థితి ఏర్పడుతుంది. తుఫాన్ కారణంగా ఇద్దరు చనిపోయారు. ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడు అందుబాటులో ఉంటే ప్రభుత్వంపై నమ్మకం కలుగుతుంది... మన చర్యలతో ప్రభుత్వంపై భరోసా పెరిగిందని అన్నారు.

## బీహార్ లో చావో రేవో...

మరోవైపు నితీష్ కుమార్ గత రెండు దశాబ్దాలుగా బీహార్ ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఆయన విషయంలో ప్రజల నుంచి వ్యతిరేకత వస్తే మాత్రం ఎన్డీఏకు ఇబ్బందికరమే.ఒకవేళ ఇక్కడ మహా ఘట్ బంధన్ విజయం సాధిస్తే కాంగ్రెస్ పార్టీకిజవసత్వాలు వస్తాయి. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ పుంజుకునే అవకాశం ఉంది. ఆ ప్రభావం ఏపీ పై కూడా ఉండనుంది. అదే జరిగితే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఇబ్బంది కరం. ఇప్పటికే ఆ పార్టీకి చాలా మంది నేతలు గుడ్ బై చెప్పారు. మరికొందరు కూటమి పార్టీల్లో అవకాశం లేక ఉండిపోయారు. అటువంటి వారంతా కాంగ్రెస్ పార్టీ గూటికి చేరితే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఇబ్బంది కరం. అంతిమంగా అది టిడిపి కూటమికి మేలు చేస్తుంది.మరోవైపు బీహార్లో ఎన్డీఏ కూటమి ఓడిపోతే మాత్రం తెలుగుదేశం వైఖరిలో మార్పు ఖాయం. ఎందుకంటే 2026లో మరికొన్ని రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు జరుగుతాయి. అప్పుడు కూడా బిజెపికి, వాటి మిత్రపక్షాలకు ప్రతికూల ఫలితాలు వస్తే చంద్రబాబు యూ టర్న్ తీసుకునే అవకాశం ఉంది. అయితే అప్పుడు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి బిజెపి ఆప్షన్ గా మారుతుంది. ఎందుకంటే కాంగ్రెస్ పార్టీకి ఇప్పటివరకు దూరంగా ఉంటూ వస్తోంది వైయస్సార్ కాంగ్రెస్. అదే సమయంలో బిజెపి పట్ల సానుకూలంగా ఉంది. అయితే ఈ పరిణామాలన్నీ బీహార్ ఎన్నికల ఫలితాలపై ఆధారపడి ఉంటాయి. మరి ఏం జరుగుతుందో చూడాలి.

## రాజకీయ పార్టీలకు టెలివిజన్ చానల్ల అండ..!

# విలువలు గాలికి.. కాసులు తమ జేబుల్లోకి..!?

**ప్రజల్ని చైతన్యపరిచే మీడియా పూర్తిగా రాజకీయ పార్టీల చేతిలో కీలుబొమ్మలుగా మారిపోతున్నాయి. అధికారంలో ఉన్న పార్టీ ఇచ్చిన హామీలను ప్రజలకు ఎంతవరకు అమలుపరిచింది తెలియజెప్పే విధి విధానాల్లో ఆయా ఎలక్ట్రానిక్ ప్రింట్ మీడియాలు పార్టీలను పంచుకుంటున్నాయి. ఈ విషయం ప్రజలందరికీ తెలుసు. కానీ ఎవరు నోరు మెదపరు. ఎవరు ఎట్లైనా పోనీ ఎన్నికలు వస్తే నా ఓటుకు ఎంత ఇస్తావు? ఎన్నికలు అయిపోయే వరకు బీరు బిర్యాని ఫుల్లుగా దొరుకుతుంది కదా అని ఆలోచించే ఓటర్లే అధికమవుతున్నారు. ఇది ఓటర్ల తప్పేమీ కాదు! ఎందుకంటే రాజకీయ పార్టీలు ఓటు వేసే జనాలను అలా తయారు చేయడం అలవాటుగా మారిపోయింది.**





✍ కదారి శ్రీనివాస్
జయభేరి సీనియర్ జర్నలిస్ట్,
కవి రచయిత, గాయకుడు,
తెలంగాణ ఉద్యమకారుడు,
గిడుగు రామ్మూర్తి అవార్డు గ్రహీత

✍ జయభేరి, హైదరాబాద్ :

ఇది ఇలా ఉంటే ఇక ప్రసారమాధ్యమాల గోల అంతా ఇంత కాదు. ఒక్కో చానళ్లు ఒక్కో రాజకీయ పార్టీకి అండ! ఇదంతా ఆంధ్ర విష సంస్కృతి పూర్తిగా తెలంగాణ రాష్ట్రంలో అంటువ్యాధుల వ్యాపించిపోయింది! ఇప్పటికీ ఆ వ్యాధి ముదిరిపోయి తెలంగాణ రాష్ట్రంలోనూ రోజురోజుకు ఎక్కువ అవుతూ వస్తుంది. వాస్తవానికి సమాచార హక్కు ప్రసార మాధ్యమాలు మీడియా అనేవి ప్రజలకు రాజకీయ సామాజిక చైతన్యం కల్పించే విధంగా ఇవి పని చేయాలి. విలువలు లేని మీడియా కాసుల కోసం కక్కుర్తి పడుతూ అనేక కథనాలను తమకిష్టం వచ్చినట్టుగా అదే జర్నలిజంగా భావిస్తూ మెప్పిస్తూ బాగానే చానళ్లు దినదిన అభివృద్ధి చెందుతూ వస్తున్నాయి. విలువలను గాలికి వదిలేసి ప్రజా పాలనలో ప్రజలకు ఎలాంటి హక్కులు విధులు బాధ్యతలు ఉంటాయో తెలియజెప్పే మీడియా పూర్తిగా అమ్ముడు పోతుంది. ఇంతకంటే దీనమైన వ్యవస్థ ఎక్కడైనా ఉంటుందా?

భావవ్యక్తీకరణ స్వాతంత్రపు హక్కు రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కుగా గుర్తించిన ప్రసారమాధ్యమాలు కాసులు వసూలు చేసుకునే పనిలో సీఈఓ వ్యవస్థను ఏర్పాటు చేసి మీడియాను పూర్తిగా వ్యాపార కేంద్రాలుగా మలి చేశారు. మీడియా లో మార్కెటింగ్ వ్యవస్థ మీడియా విధి విధానాలను శాసిస్తుంది అంటే అతిశక్తి కాదు. ప్రజలు ఏమైపోతే తమకేంటి? ప్రజలు చాలా బిజీగా గడుపుతుంటారు! ఇవాళ విన్న విషయం రేపు గుర్తు పెట్టుకోరు! ప్రతిదీ ప్రజలకు చెప్పాల్సిన అవసరం లేదు! అయినా ప్రజలు ఇవేవీ పట్టించుకోరు? అనే ఆలోచనలతో ఈనాటి మీడియా వ్యవస్థ పూర్తిగా నాశనమై పోయి సోషల్ మీడియా చేతుల్లోకి వెళ్లిపోయింది.

అయినా సరే తెలంగాణ రాష్ట్రంలో ఆంధ్ర మీడియా ఛానల్లు వేర్లు పాతుకుని పోయి ఉండడం వల్ల ఆ చానల్లో కోసం పనిచేసే తెలంగాణ బిడ్డలు తెలంగాణను తాకట్టు పెడుతున్నారు. ఫలానా ఛానల్ ఐడి కార్డు మెడలో వేసుకొని మాదే పెద్ద ఛానల్ అంటూ ఎలక్ట్రానిక్ ప్రింట్ మీడియాలో తమదే పై చేయి అంటూ ఏకంగా ప్రెస్ క్లబ్ లోని బాధ్యతలు కూడా తామే దక్కించుకుంటున్నారు. తాజాగా జరిగిన సోమాజిగూడ ప్రెస్ క్లబ్ ఎలక్షన్ లో ఈనాడు సాక్షి ప్రతినిధులే అక్కడ ఎన్నిక కావడం ఎందుకు నిదర్శనం.ఎన్నికైన అభ్యర్థులు మన తెలంగాణ వాసులే కానీ పనిచేస్తున్నది ఆంధ్ర పెత్తందారుల గుత్తాధిపత్యంలో కూలీలుగానే మిగిలిపోతున్నారు!

విలువలతో నడిపించాల్సిన మీడియా పూర్తిగా అన్నీ వదిలేసి కరెన్సీ కట్టల కోసం ఎంతకైనా తెగించే దొడ్డిదారిని వెతుక్కునే ఆలోచనలతో దినదినాభివృద్ధి చెందుతున్నారు. ఇక ప్రజల అవసరాలు ఏంటి? వారు ప్రశ్నించాల్సిన బాధ్యతను గుర్తు చేయకుండా పొద్దున ప్రసారం మొదలు అయిన దగ్గర నుంచి సాయంత్రం వరకు తమ రాజకీయ పార్టీ ఎజెండాను తమ భుజాల మీద వేసుకున్న ఆయా ప్రైవేటు శాటిలైట్ ఛానల్ ఊకదంపుడు కార్యక్రమాలతో అధికారంలో ఉంటే ప్రత్యర్థి పై అదే ప్రతిపక్ష పాత్రలో ఉంటే అధికార ప్రభుత్వంపై విషం చిమ్మే జర్నలిస్టులు లేకపోలేదు. తమ యజమాని ఏం చెప్తారో ఆ జర్నలిస్టు ఆ పని చేయాల్సిందే అన్నట్టుగా పొట్టకూటికోసం చేయక తప్పదు అంటూ సరిపెట్టుకునే జీవితంలో సీనియర్ జర్నలిస్టులు సైతం తమ వృత్తికి ద్రోహం చేస్తూ వస్తున్నారు. సామాన్యుడి చేతిలో సామాజిక అస్త్రంగా ఉండాల్సిన మీడియా కరెన్సీ కట్టల మోజులో మేమే నెంబర్వన్ న్యూస్ ఛానల్ అంటే కాదు మేమే నెంబర్ వన్ ప్రింట్ పేపర్ అంటూ పోటాపోటీగా డప్పు కొట్టుకునే పనిలో నిమగ్నమైతారే తప్ప సామాజిక సేవలో మేము ముందున్నామా అనే విషయాన్ని మాత్రం లెక్కకు తీసుకోరు.

**ఎవరో ఒకరు ఎప్పుడు వస్తారు..!?**

ఇప్పుడు అప్పుడు ఎవరో ఒకరు నడవరా ముందుకు ఆటో ఇటో ఎటో వైపు.. అన్న పాటలు ఎవరు ముందుకు అడుగేయాలి అనే ప్రశ్న ఇప్పుడు ఏళ్ల తరబడి ప్రశ్నగానే మిగిలిపోతుంది... ప్రజాస్వామ్యం పూర్తిగా అవిటిదై భావితరాలకు స్వార్థం అనే అంటు రోగాన్ని అందించే విధంగా కిందకు దిగజారిపోతుంది... రేపటి తరం ఈ దేశానికి ఒక సంపద అని చెప్పుకొస్తున్న ఈ రాజకీయ పార్టీ కీలక నేతలు ఆ రేపటి తరాన్ని తమ పెత్తనం కోసం వాడుకునే పనిలో రాజ్యాంగాన్ని బాగానే అడ్డం పెట్టుకొని అధికారాన్ని దక్కించుకుంటున్నారు.


నేర చరిత్ర గల వాళ్లు రాజకీయంలో అడుగుపెట్టి అధికారం కోసం ఎన్ని అడ్డదారులైన తొక్కి అధికారాన్ని దక్కించుకుంటుంటే అలాంటి వారిని ఏరి పారేయాల్సిన బాధ్యత కలిగిన ఆయా మీడియా చానళ్లు అసలు వాటి గురించే నోరు మెదపరు. పైగా ఆ నాయకుడు ఆయన తండ్రి ఆయన చేసిన రాజకీయాలు వాటి గురించి ఉన్నవి లేనివి కల్పించి ప్యాకేజీల రూపంలో టెలికాస్ట్ చేయడానికి కూడా వెనుకాడరు... ఎందుకంటే ఆ రాజకీయ నాయకుడు ఇచ్చే ప్యాకేజీ అంత బరువుగా ఉంటుంది కాబట్టి... ఇలా మీడియా పూర్తిగా తమ బాధ్యతను మరిచిపోతుంటే ప్రజాస్వామ్యమా నీ అడ్రస్ ఎక్కడ అని రేపటి తరం ప్రశ్నిస్తే ఈ సమాజం ఏం సమాధానం చెబుతుంది!?

నిజాన్ని నిక్కచ్చిగా చెప్పాల్సిన మీడియా పూర్తిగా అమ్ముడుపోతోంది. ఒక్కో రాజకీయ పార్టీకి ఒక్కో మీడియా, అవతలి వాళ్లను తిట్టిపోసే పనిలో వందకి కి వంద శాతం నిమగ్నం అయిపోతారు.. అందుకే సోషల్ మీడియా విస్తృతంగా వచ్చినప్పటి నుంచి పెద్దపెద్ద మీడియా ఛానల్లు పూర్తిగా పెత్తనం పోయే ప్రమాదంలో పడింది. అలాంటి ఛానలు ఉంటే ఎంత లేకుంటే ఎంత అని సోషల్ మీడియాలో నెటిజన్లు దుమ్మెత్తి పోస్తున్నారు..

మొన్నటికి మొన్న ఒక మహిళ ఎమ్మెల్యేల దగ్గర చేసే పి ఆర్ ఓ ల పెత్తనాన్ని ప్రశ్నిస్తూ చేసిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ గా మారింది... అదే మహిళ మరొక వీడియోలు ఎమ్మార్వో సందర్భ ఎంత విలువ యిందో తెలియజేస్తూ నీతిగా పని చేయండి అంటూ బాగానే గడ్డి పెట్టింది... ఇలా సోషల్ మీడియాలో ప్రతి ఒక్కరు దాన్ని ఒక ఆయుధం మలుచుకుని ప్రజాస్వామ్య మనుగడకు పునాది వేస్తున్నారు. అంతేకానీ పెద్ద చానల్లో పెద్ద పత్రికలు అని చెప్పుకొచ్చే ఏ ఒక్క మీడియా ప్రజల బాగోగుల గురించి పట్టించుకున్న పాపను పోలేదు... ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు అయిన దగ్గర్నుంచి కూడా ఆ చానల్లో పని ఆ నాయకున్ని పొగడడం ప్రతిపక్ష పార్టీలో ఉన్న నాయకుని తిట్టడమే పనిగా పెట్టుకుని అందుకోసమే పని చేస్తున్నాయి... అందుకే సోషల్ మీడియా వాడుతున్న ప్రతి ఒక్కరు పెద్ద పత్రికలు అని చెప్పుకునే ఈ వ్యవస్థలో వాటి ఉనికిని ఎప్పటికప్పుడు ప్రశ్నించాలి.? విలువలను గాలికి వదిలేసిన మీడియా అసలు బాగోతాన్ని బట్ట బయలు చేసేలా సోషల్ మీడియాలో ప్రతి ఒక్కరూ సైనికులుగా మారి ప్రజలకు రాజకీయ మేలుకొలుపును కలిగించాలి.. ఓటు ఎంత పవిత్రమైందో తెలియజేసే అనేక కార్యక్రమాలను సోషల్ మీడియాలో విస్తృతంగా చేయాలి.. మీడియా అంటే ఆ పెద్ద ఛానల్ ఏ కాదు... నువ్వు నేను ప్రశ్నించే తత్వం ఉంటే ప్రతి ఒక్కరూ జర్నలిస్టే..

---

# మన దేహమే దేవాలయం..!




దేహాన్ని పరిశుభ్రంగా ఉంచుకుంటే అది దేవాలయంగా మారుతుంది. అలాంటి దేహంలో మనస్సు ప్రశాంతంగా ఉంటే ఆరోగ్యం మన వెంటే ఉంటుంది... అలాంటి దేహం లాంటి దేవాలయం లోకి ఏలాంటి ఆహారం తీసుకోవాలో మనమే ఆలోచించుకోవాలి. మన శరీర అవయవాలన్నీ జాగ్రత్తగా చూసుకోవాల్సిన బాధ్యత మన చేతుల్లో చేతల్లోనే ఉంటుంది. మీకు ఉదయం అల్పాహారం లేనప్పుడు పొట్ట గాయపడుతుంది. మీరు 24 గంటల్లో 10 గ్లాసుల నీరు కూడా తాగనప్పుడు కిడ్నీలు గాయపడతాయి. మీరు 11 గంటల వరకు నిద్రపోకపోయినా, సూర్యోదయానికి మేల్కొనకపోయినా గాల్ బ్లాడర్ గాయపడుతుంది. మీరు చల్లని మరియు పాత ఆహారాన్ని తినేటప్పుడు చిన్న ప్రేగు గాయపడుతుంది. మీరు ఎక్కువగా వేయించిన మరియు కారంగా ఉండే ఆహారాన్ని తినేటప్పుడు పెద్ద ప్రేగులు గాయపడతాయి. మీరు పొగతో ఊపిరి పీల్చుకున్నప్పుడు, సిగరెట్ల కలుషిత వాతావరణంలో ఉన్నప్పుడు లంగ్స్ (ఊపిరితిత్తులు) గాయపడతాయి. మీరు భారీగా వేయించిన ఆహారం, జంక్, ఫాస్ట్ ఫుడ్ తినేటప్పుడు లివర్ గాయపడుతుంది. మీరు ఎక్కువ ఉప్పు మరియు కొలెస్ట్రాల్‌తో మీ భోజనం తిన్నప్పుడు గుండె గాయపడుతుంది. మీరు తీపి పదార్థాలు తినేటప్పుడు ప్యాంక్రియాస్ గాయపడుతుంది. ఎందుకంటే అవి రుచికరమైనవి మరియు ఉచితంగా లభిస్తాయి. మీరు చీకటిలో మొబైల్ ఫోన్, కంప్యూటర్ స్క్రీన్ వెలుగులో పనిచేసేటప్పుడు కళ్ళు గాయపడతాయి. మీరు ప్రతికూల ఆలోచనలను ఆలోచించడం ప్రారంభించినప్పుడు మెదడు గాయపడుతుంది. ఈ భాగాలన్నీ మార్కెట్లో అందుబాటులో లేవు. కాబట్టి జాగ్రత్త వహించండి. మీ శరీర భాగాలను ఆరోగ్యంగా ఉంచండి. ఎందుకంటే నీ దేహం దేవుని ఆలయం. ఒక్క రోజు లంగ్స్ చేసే పని వెంటిలేటర్ చేస్తే పాతిక వేలు. కిడ్నీస్ చేసే పని డయాలిసిస్ చేస్తే 10 వేలు. హార్ట్, లంగ్స్ మిషన్ అయితే రోజుకు లక్షల్లో.. ఇంకా బ్రెయిన్ కి ప్రత్యామ్నాయం రాలేదు, వస్తే కోట్లల్లో.. అంటే.. మెడికల్ పరిభాషలో, రోజుకు కొన్ని లక్షల విలువైన పని మన శరీరం చేస్తుంది.దేవుడికి కృతజ్ఞతలు చెప్పటానికి ఇంతకంటే బలమైన కారణం కావాలా..? శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచుకోవడానికి వేరే ఉదాహరణలు కావాలా..? ఆలోచించండి. ఆరోగ్యాన్ని కాపాడుకోండి.. మన ఆరోగ్యమే మనకు అన్నింటిని మించిన ఆస్తి మరియు ఐశ్వర్యం. శంభాల 360 సొల్యూషన్ ద్వారా మీ ఆరోగ్యం కాపాడుకుందాం.. మీరు ఆరోగ్యంగా ఉండాలని మీ మంచి కోరుకునే.... మీ ఆత్మీయుడు..



✍ Dr. హరి హర నాద రాజు
శంబాలా 360 సోలుషన్స్
9177 445 591
www.shambala360solutions.com

# పత్తి రైతులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలి

- అకాల వర్షానికి పత్తి పంటకు తీ తీవ్ర నష్టం
- పత్తి రైతులకు ఎకరానికి 50 వేల రూపాయల నష్ట పరిహారం ప్రభుత్వమే అందించాలి
- బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి



**జయభేరి, షాద్ నగర్, అక్టోబర్ 29 :**

ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రవేశ పెట్టిన పసల్ బీమా యోజన పథకం రాష్ట్ర ప్రభుత్వం ఇంప్లిమెంటేషన్ చేసినుంటే రైతులకు మేలు జరిగేది అని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. అధిక వర్షాలవల్ల నష్టపోయిన పత్తి రైతులను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. కొత్తూరు మండలంలోని తీగపూర్ గ్రామంలో అధిక వర్షాల వల్ల దెబ్బ తిన్న పత్తి పంటను పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ; రాష్ట్ర వ్యాప్తంగా అధిక వర్షాల వల్ల పత్తి పంటలు యాభై శాతం దెబ్బ తిన్న కూడ ఇప్పటి వరకు ఏ ఒక్క అధికారి కూడ పంటలను పరామర్శించలేదు అని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పత్తి రైతులను ఆదుకొని ఎకరానికి 50 వేల రూపాయలను నష్ట పరిహారం అందించాలని అన్నారు. ఇకనైనా అధికార పార్టీ నాయకులు, అధికారులు కళ్ళు తెరిచి గ్రామాల్లో పర్యటించి రైతులకు భరోసా కల్పించవలసిన అవసరం ఎంతైన ఉందని అన్నారు. భారీ వర్షాల కారణంగా పంట నష్టం రైతులకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో అన్ని సహాయ సహకారాలు అందించి వారిని ఆదుకోవాలని విష్ణువర్ధన్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



## గంగమ్మ తల్లికి ఒడిబియ్యం పోసిన వాసవి మహిళలు

**జయభేరి, దేవరకొండ :**

కార్తీక మాసంలో గంగమ్మకు ఒడిబియ్యం పోసే కార్యక్రమం కు దేవరకొండ వాసవి మహిళలు శ్రీకారం చుట్టినారు. మంచి సంకల్పంతో దేవరకొండ వాసవి మహిళలు కార్తీక మాసంలో దేవరకొండలో పప్రదంగా కొండ భీమనపల్లి చెరువు లో గంగమ్మ తల్లికి ఒడిబియ్యం పోసే కార్యక్రమం వైభవంగా నిర్వహించినారు. ఈ కార్యక్రమంలో చీదెళ్ల శ్రీదేవి, సముద్రాల జయ, కొత్త సావిత్రి, తేలుకుంట్ల శైలజ, ఆలంపల్లి దీపిక తదితరులు పాల్గొన్నారు.



## మా రోడ్డును బాగు చేయండి మహాప్రభు



**జయభేరి, డిండి :**

డిండి మండలం వావిల్ కోల్ (వడ్డెర గూడెం) నుండి బ్రాహ్మణపల్లి బీటీ రోడ్డును వీలైనంత త్వరగా పూర్తి చేయాలని డిండి మండల బి ఆర్ ఎస్ నాయకులు ఓర్సు ముత్యాలు సంబంధిత అధికారుల ను కోరారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటికే ప్రజలు రైతులు వాహన దారులు ఈ మార్గం గుండా వెళ్లాలంటే ఎన్నో అవస్థలు పడుతున్నారు. కంకర పోసి వదిలేసినారు. వీలైనంత త్వరగా ఈ రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయాలని కోరినారు. ఏమాత్రం వర్షం వచ్చినా అసలు రోడ్డు వెంబడి వాహనదారులు పాదచారులు చాలా ఇబ్బంది పడుతున్నారని వడ్డెర గూడెం బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు ఓర్సు ముత్యాలు తెలియజేసినారు.

## ఏసిబీకి చిక్కిన దేవాదాయ ధర్మాదాయ శాఖ ఇంచార్జి ఎస్ఈగా ఊడెపు రామారావు



**జయభేరి, యాదగిరిగుట్ట, అక్టోబర్ 29:**

ఏసిబీ వలకు పెద్ద అవినీతి చేప చిక్కింది. యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మి నరసింహ స్వామి ఆలయంలో ఎలక్ట్రిసిటీ ఈఈ, రాష్ట్ర దేవాలయ ధర్మదాయ శాఖ ఇంచార్జి ఎస్ఈగా పనిచేస్తున్న ఊడెపు రామారావు బుధవారం ఒక కాంట్రాక్టు నుంచి రూ.1,90,000 లంచం తీసుకుంటుండగా ఏసిబీ అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. ఊడెపు రామారావు గత కొన్నెండ్లుగా యాదగిరిగుట్ట ఆలయంలో ఎలక్ట్రిసిటీ విభాగంలో పలు హోదాలలో విధులు నిర్వహిస్తున్నాడు. గతంలో కూడా రామారావుపైన చాలా రకాలు అరోపణలు వచ్చి సస్పెండ్ అయ్యాడు.

ఊడెపు రామారావు కూడబెట్టిన అక్రమ ఆస్తుల గురించి ఏసిబీ అధికారులు దృష్టి పెట్టినట్లు సమాచారం.

రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ చరిత్రలో ఎస్.ఈ స్థాయి అధికారి,యాదగిరిగుట్ట దేవస్థానంలో ఈఈ స్థాయి అధికారి ఏసీబీకి పట్టు పడడం ఇదే ప్రథమం. గత కొన్నేళ్లుగా రామారావుపై అవినీతి ఆరోపణలు పెద్ద ఎత్తున రావడం సర్వసాధారణమైపోయింది.

ఉప్పల్ లోని మెడిప్లస్ మెడికల్ షాప్ వద్ద జరిగిన ఈ ట్రాప్ తర్వాత ఊడెపు రామారావును యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలోని ప్రధాన కార్యాలయానికి తీసుకువచ్చారు. రామారావు ఇటీవల చేసిన సంతకాలు తీసుకున్న ప్రాధాన్యత కలిగిన అంశాలు తదితర వివరాలపై ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది.

## కొండకింద విష్ణు పుష్కరిణి వద్ద నీటి నాణ్యతను పరిశీలించిన సీఎం ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీనివాస్ రాజు



**జయభేరి, యాదగిరిగుట్ట, అక్టోబర్ 29:**

యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారికి కార్తీక మాసం బుధవారం రోజు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కొండ కింద సత్యనారాయణ స్వామి వ్రత పూజల్లో, కొండపైన శ్రీ స్వామివారి కల్యాణ మహోత్సవంలో పుణ్య దంపతులు అధిక సంఖ్యలో పాల్గొన్ని మొక్కలు చెల్లించుకున్నారు. ఉత్తర ద్వారం ఎదురుగా ప్రత్యేక మంటపంలో పలువురు పుణ్య దంపతులు కార్తీక దీపాలు వెలిగించుకొని పూజలు నిర్వహించారు. వర్షం కారణంగా భక్తులు ఒకింత ఇబ్బందులు పడుకుంటూ స్వామివారి దర్శనం చేసుకున్నారు. యాదగిరిగుట్ట దేవస్థానానికి బుధవారం వివిధ కైకార్యాల ద్వారా 9లక్షల 17 వేల 614 రూపాయల ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. బుధవారం కొండకింద విష్ణు పుష్కరిణి వద్ద నీటి నాణ్యతను సీఎం ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీనివాస్ రాజు బుధవారం పరిశీలించారు. వరంగల్ జిల్లా మేడారం వెళుతూ మార్గం మధ్యలో యాదగిరిగుట్ట దేవస్థానం పుష్కరిణి సందర్శించి,పుష్కరిణిలో నీరు నాణ్యత పరిశీలించారు. టర్బిడిటి (క్రిస్టల్ క్లియర్), క్లోరిన్ నీట్ గా ఉన్నట్లు పేర్కొన్నారు. ఈయన వెంట ఇంజనీరింగ్ అధికారులు సిఈ వసంత్ నాయక్,ఇంచార్జి ఎస్ఈ రామారావు తదితరులున్నారు.

## కులవృత్తి జీవనోపాధి కార్మికుల ఆర్థిక స్థితిని బలోపేతం చెయ్యండి

- కులవృత్తి ఆధారిత కార్మికులకు ఆధునాతన శిక్షణ అవసరం

కె.వి.ఐ.సి స్టేట్ డైరెక్టర్ డా. గ్రీప్




**జయభేరి, పరవాడ:**

కులవృత్తిపై ఆధారపడి జీవనోపాధి సాగిస్తున్న కార్మికుల ఆర్థిక స్థితిని బలోపేతం చేసేందుకు ఆధునాతన సాంకేతిక పరిజ్ఞానం అందించడం అత్యవసరమని కె.వి.ఐ.సి (ఖాదీ అండ్ విలేజ్ ఇండస్ట్రీస్ కమిషన్) స్టేట్ డైరెక్టర్ డాక్టర్ ఎస్. గ్రీప్ అన్నారు. బుధవారం పరవాడ మండలం జాజులవానిపాలెం గ్రామంలోనూ కె.వి.ఐ.సి ఆధ్వర్యంలో మట్టి పాత్రల తయారీ ఆధునాతన 10రోజుల శిక్షణా తరగతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ కార్మికులు తమ సంప్రదాయ వృత్తులను కొనసాగించడమే కాకుండా, ఆధునాతన పరికరాలు, యంత్రాలను వినియోగిస్తే ఉత్పత్తి సామర్థ్యం పెరిగి ఆదాయ వనరులు విస్తరించవచ్చు. కులవృత్తి ఆధారంగా జీవించే కుటుంబాలు సాంకేతికతను అలవర్చుకుంటే స్వావలంబన సాధ్యమవుతుంది అని అన్నారు. ఈ సందర్భంగా డి.ఐ.సి జీఎం ప్రసాద్ మాట్లాడుతూ గ్రామీణ యువత పరిశ్రమల విస్తరణలో కీలక పాత్ర పోషించాలి. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వినియోగించి స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా కుమ్మర శాలివాహన సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి అనకాపల్లి రామస్వామి, కోశాధికారి మాకారపు సత్యనారాయణ, పలువురు గ్రామీణ కార్మికులు, సంఘ నాయకులు, మహిళా స్వయం సహాయక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



## టిడ్కో నివాస గృహాలలో కనీస సదుపాయాలు కల్పించాలి

**జయభేరి, పరవాడ:**

మొంధా తుఫాను వల్ల అనకాపల్లి జిల్లా పరవాడ మండలం టిడ్కో కాలనీలో ప్రజలందరూ కనీస సదుపాయాలు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారనీ మహిళా ఐధ్వ సభ్యులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలనీలో సరియ్యిన కాలువలు లేకపోవడం వలన వర్షపు నీరు నివాస గృహలలోకి వెళ్లి ప్రజలు ఇబ్బంది పడుతున్నారనీ గత నాలుగు రోజులుగా గృహలలో సరిగా కరెంట్ లేక తీవ్ర అవస్థలు పడుతున్నారు. వీధిలైట్లు,వీధి స్తంభాలు , రహదారులు లేకపోవడం వలన ఇక్కడ ఉండడానికి ఆలోచనలోకి వెళ్ళుతున్నారని వీటి పై పంచాయతీ అధికారులు దుష్టి సారించి తొందరగా సమస్యలు పరిస్కారించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా ఐద్వా అనకాపల్లి జిల్లా జాయింట్ సెక్రెటరీ అన్నపూర్ణ, ఏరియా ప్రెసిడెంట్ బంగారం,స్థానిక కమిటీ సభ్యులు వరలక్ష్మి,అరుణ, సరోజినీ, గోపాల్ రావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రయాణికుల దాహార్తి తీర్చిన సీఐ



**జయభేరి, గార్ల, అక్టోబర్ 29:**

మెంథా తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలకు మహబూబాబాద్ జిల్లా, కురవి మండలం, స్టేషన్ గుండ్రాతిమడుగు రైల్వే స్టేషన్ లో కోణార్క్ ఎక్స్ ప్రెస్ రైలు నిలిచిపోయింది. దింతో ప్రయాణికులు అనేక గంటలుగా ఇబ్బంది పడ్డారు. తమ వద్ద డబ్బులు ఉన్న కొనుక్కుందామన్నా కనీసం నీళ్లు, ఆల్పాహారం కూడా లేక ఆందోళన చెందుతున్న విషయం తెలుసుకున్న గార్ల బయ్యారం సీఐ రవికుమార్ తమ సిబ్బందితో కలిసి అక్కడ చేరుకొని ప్రయాణికులకు పండ్లు, బిస్కెట్ , మంచి నీళ్లు అందించారు.తమ దాహార్తి తీర్చినందుకు సీఐ రవికుమార్ ను ప్రయాణికులు అభినందించారు.

## ధాన్యం కొనుగోలును చేపట్టాలి



**జయభేరి, తుర్కపల్లి, అక్టోబర్ 29:**

మండల వ్యాప్తంగా సొసైటీ, ఐకెపి సెంటర్లను ప్రారంభించి వరి ధాన్యం కొనుగోలు చేపట్టాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు బట్టుపల్లి అనురాధ అన్నారు. బుధవారం తుర్కపల్లి మండల కేంద్రంలోని సిపిఎం పార్టీ కార్యాలయంలో మండల కమిటీ సమావేశాన్ని గడ్డమీది నరసింహ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల వ్యాప్తంగా రైతులు 20 రోజుల నుండి వారి ధాన్యాన్ని పిఎసిఎస్, ఐకెపి సెంటర్లకు తీసుకొచ్చి కొనుగోలు కోసం రైతులు పడిగాపులు కాస్తున్నారని అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చిన వారి ధాన్యాన్ని వాటికి పట్టాల వసతులు ప్రభుత్వం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి పోతరాజు జహంగీర్, కమిటీ సభ్యులు కొక్కొండ లింగయ్య, తలారి మాతయ్య, తుటి వెంకటేశం పాల్గొన్నారు


## పోలీసు అమరవీరులకు నివాళులు



**జయభేరి, తుర్కపల్లి, అక్టోబర్ 29:**

పోలీసు అమరవీరుల సంస్కరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని తుర్కపల్లి మండల కేంద్రంలో పోలీస్ స్టేషన్ పరిధిలోని పోలీసులు, యువత తో కలిసి క్యాండిల్స్ వెలిగించి పోలీసు అమరవీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్సై తగ్గియోద్దీన్ మాట్లాడుతూ విధి నిర్వహణలో అమరులైన పోలీసు అమరవీరులకు గౌరవ పూర్వకంగా నివాళులర్పించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో పోలీసులు, యువకులు పాల్గొన్నారు.

## ఉచిత గాలికుంటు వ్యాధి టీకాల పంపిణీ



**జయభేరి, తుర్కపల్లి, అక్టోబర్ 29:**

ఉచిత గాలికుంటు వ్యాధి టీకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల పశు వైద్యాధికారి డాక్టర్ రామచంద్రారెడ్డి అన్నారు. తుర్కపల్లి మండలం తిరుమలపురం గ్రామంలో జాతీయ పశు వ్యాధులు నివారణ కార్యక్రమంలో భాగంగా పశు వైద్య పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువులకు ఉచిత గాలికుంటు వ్యాధి టీకాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలేరు మార్కెట్ కమిటీ చైర్మన్ అయినాల చైతన్య మహేందర్ రెడ్డి, పశు వైద్యాధికారి డాక్టర్ రామారావు, పశువైద్య సిబ్బంది శేఖర్, రాఘవేందర్, షంషద్దీన్, వీరు, పెండెం ప్రవీణ్, మహేష్, రైతులు పాల్గొన్నారు.

# రచ్చకెక్కిన తిరుమల డైరీ భాగస్వామ్య విబేధాలు




జయభేరి, విజయవాడ:

తిరుమల డైరీ ఎండీ బత్తిని నాగేశ్వర రావు సోదరుడు బత్తిని ప్రభాకర్ రావు మీడియాతో మాట్లాడారు. తిరుమల డైరీ విషయంలో మా అన్న, డైరీ ఎండీ బత్తిని నాగేశ్వర రావు నలుగురు సోదరులను మోసం చేశారు. మా అన్న పేరు మీద ట్రాన్స్ ఫర్ అయిన డైరీ షేర్లు ఫోర్జరీ ద్వారా జరిగాయని ఆరోపించారు. మా సోదరులకు ఆస్తి సమాన భాగంగా పంపిణీ చేయలేదు. తిరుమల డైరీలో రావాల్సిన షేర్లు మా నలుగురు సోదరులకి దక్కలేదు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు కూడా చేయనున్నాం. మా తండ్రి నుంచి రావాల్సిన వారసత్వ ఆస్తిని కూడా నాగేశ్వర రావు మోసపూరితంగా తనకు మళ్లించుకున్నారు. మేం ఎనిమిది మంది సోదరులు. శివ ప్రసాద్ అనే ఒక సోదరుడు తనకు తిరుమల డైరీలో రావాల్సిన 16500 షేర్లు కోసం 2000లో నోటీసు పంపారు. నోటీసు రావటంతో సోదరులను మోసం చేయవద్దని భాగస్వాములు నాగేశ్వర రావును మందలించారు. దీంతో శివప్రసాద్ కు తెలియకుండా షేర్లు అన్నీ నాగేశ్వర రావు బదిలీ చేసుకున్నారు. ఎవరైనా కుటుంబం నుంచి ఎదురు తిరిగితే నాగేశ్వర రావు, వాళ్లను కుటుంబ నుంచి బయటకు పంపుతున్నారని అన్నారు. షేర్ హోల్డర్స్ ను బయటకు పంపాలన్నా బ్యాంక్ ద్వారా సెటిల్ చేయలనే నిబంధన ఉన్నా ఆయన అవి పాటించలేదు. 8 మంది సోదరులకు 2.50 పైసా వాటాలు ఉన్నాయని నాగేశ్వర రావు మొదట్లో మమ్మల్ని కన్విన్స్ చేసి వ్యాపారం చేసేవారు. ఆస్తులు మొత్తం తన పేరు మీద పెట్టుకోవటాన్ని నిలదీశాం. డైరీకి రుణాలు కావాలంటే అందరు ఉంటే ఇబ్బంది కాబట్టి అందరు తరపున నేనే ఉంటున్నాను అని అబద్ధాలు చెప్పారు. డైరీ అమ్మినపుడు మీకు సెటిల్ చేస్తానని చెప్పి 2013 లో జర్మనీ కంపెనీకి 1900 కోట్లకు అమ్మేశారు. ఇందులో టాక్స్ పోగా నాగేశ్వర రావుకి 235 కోట్లు వచ్చింది. నాగేశ్వరరావుకు వచ్చిన డబ్బులో 100 కోట్లను భార్య పేరుతో 2014లో టాక్స్ ఫ్రీ బాండ్లు తీసుకున్నారు. ఇపుడు దాని విలువ 315 కోట్లకు చేరింది. మాకు వారసత్వ హక్కుగా రావాల్సిన వాటాను నాగేశ్వర రావు అల్లుళ్లు అనుభవి స్తున్నారు. మేం అనుభవించాల్సిన ఆస్తిని నాగేశ్వరావు కుటుంబ సభ్యులు తీసుకోవటం బాధగా ఉంది. మా ఆర్థిక లాభాలను ఆయనే అనుభవిస్తున్నారు. డైరీ అమ్మినపుడు కుటుంబ సభ్యులు అందరి పేరు మీద అకౌంట్స్ ఓపెన్ చేసి ఫ్యామిలీకి 50లక్షలు మాత్రమే డిపాజిట్ చేశారు. ఏంటి అని అడిగితే కంపెనీ అమ్మినపుడు రెండేళ్ల పాటు 200 కోట్లను హోల్డ్ చేశారని 2016లో రాగానే మీకు ఇస్తానని చెప్పి మోసం చేశారు. మాకు ఇచ్చిన 50 లక్షలు తనకి వచ్చిన షేర్ లో ఇచ్చినట్టు చెప్పి మమ్మల్ని మోసం చేశారని అన్నారు. మరోసారి ఈ విషయంపై డీజీపీ నీ కలిసి ఫిర్యాదు చేస్తామని అన్నారు.

# రైతుల పాలిట కన్నీటి వాన

- రైతన్నను నిండా ముంచిన మొంథా తుఫాన్
- కళ్ళ ముందే కూలుతున్న రైతన్న ఆశలు
- వేల ఎకరాలలో తడిసిన పత్తి, మొక్కజొన్న
- నేల వాలిన వరి, మిర్చి పంటలు




గార్ల -బయ్యారం, అక్టోబర్ 29:

మొంథా తుఫాన్ రైతులను కోలుకోలేని దెబ్బ తీసింది.తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలతో వేలాది ఎకరాలలో వరి,పత్తి,మొక్కజొన్న,మిర్చి పంటలు నీట మునిగాయి. అకాల వర్షం రైతుల ఆశలను ఆవిరి చేసింది. ఆరుగాలం శ్రమించి సాగు చేసిన పంట ప్రకృతి వైపరీత్యం కారణంగా నీటిపాలు కాగా రైతులకు కోలుకోలేని విధంగా నష్టాన్ని కలిగించింది.మహబూబాబాద్ జిల్లా,గార్ల బయ్యారం మండలాలలో రైతులు వందలాది ఎకరాలలో పంట నష్టపోయారు.ప్రకృతి కూడా రైతన్న పై పగబట్టినట్టు చేతికి అందిన మొక్కజొన్న పంట వర్షానికి తడిసిపోవడంతో అన్నదాతలు కన్నీటి పర్యంతమవుతున్నారు.మొక్కజొన్న పంటను ఆరబోసుకుందామంటే వరుణుడు ఆగ్రహించాడని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్లపై ఆరబోసుకున్న ధాన్యం తడిసి ముద్దయిందని, తడిసిన ధాన్యం మొలకెత్తిపోయి రైతులు కోలుకోలేని పరిస్థితుల్లో ఉన్నారు.కళ్ళ ముందే చేతి కొచ్చిన పంట చేజారిపోవడంతో పెట్టుబడుల కోసం చేసిన అప్పులను ఎలా తీర్చాలో తెలియక రైతులు కన్నీరు మున్నీరవుతున్నారు. పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం గుర్తించి పంట నష్టపరిహారం చెల్లించాలని మాజీ ఎంపీపీ మాలోత్ వెంకట్ లాల్ ప్రభుత్వాన్ని కోరారు.




# దివ్యాంగ విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

- సాయిచంద్ర హెల్పింగ్ హ్యాండ్
- ముఖ్య అతిథిగా హాజరైన డిప్యూటీ కలెక్టర్(ట్రైనీ), తౌటం రోహిత్ నేత
- భవిత సెంటర్ లో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేసిన ఎంఈఓ



జయభేరి, పరకాల, అక్టోబర్ 29:

నాగ సాయి చంద్ర హెల్పింగ్ హాండ్స్ అధ్యక్షులు నూగూరి చంద్రమోహన్, కోర్ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో పరకాల ప్రభుత్వ భవిత సెంటర్ లో చదువుకుంటున్న దివ్యాంగ విద్యార్థులకు ప్యూరీ ఫైడ్ వాటర్ ఫిల్టర్, పుస్తకాలు, బ్యాగులు, వాటర్ బాటిల్లతో పాటు విద్యార్థులు చదువుకోవడానికిపుస్తకాలు, పెన్నులతో పాటు అవసరం అయ్యే వస్తువులు అందించే కార్యక్రమాన్ని మండల విద్యాశాఖ అధికారి రమాదేవి అధ్యక్షతన ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేసారు. ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన (ట్రైనీ) డిప్యూటీ కలెక్టర్ తౌటం రోహిత్ నేత మాట్లాడుతూ అవసరార్థులకు ఆపన్న హస్తం అందిస్తూ మేమున్నామంటూ ముందుకు సాగుతున్న శ్రీ నాగ సాయి చంద్ర హెల్పింగ్ హాండ్స్ నిర్వాహకులను కొనియాడారు. విద్యార్థులకు పుస్తకాలతో పాటు వాటర్ ప్యూరిఫైడ్ ఫిల్టర్ తదితర వస్తువులను అందించడాన్ని స్ఫూర్తిగా తీసుకొని ఉన్నతంగా చదువుకోవాలని కోరారు. కార్యక్రమం అనంతరం విద్యార్థులకు వారి తల్లి దండ్రులకు భోజనాలు ఏర్పాటు చేశారు. ఇట్టి కార్యక్రమంలో పరకాల ఎంఈఓ ఎస్. రమాదేవి, కమ్యూనిటీ మొబిలైజేషన్ ఆఫీసర్ బి.సుదర్శన్ రెడ్డి, కోర్ కమిటీ సభ్యులు వి. రమేశ, యం. శ్రీనివాస్ సురేష్ , కాంప్లెక్స్ హెడ్మాస్టరులు సి.హెచ్. మధు, సురేందర్ రిసోర్స్ పర్సన్ జి .రమాదేవి , సి.ఆర్.పి.లు ఏ.రమేశ్ బాబు, శ్రీలత , కే. శ్రీనివాస్. విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# దంచి కొడుతున్న వానలు

- రైతే రాజు అనడానికే నా... ఏ ప్రభుత్వం ఆదుకోదా...



జయభేరి, జయభేరి, సైదాపూర్:

కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండల్ లో దంచి కొడుతున్న వానలు. అకాల వర్షాలతో తల్లడిల్లి పోతున్న రైతన్న పంట.. ఆరుగాలాల కష్టపడి పండించిన పంట చేతికి రాకపోతే ఎంత బాధ ఉంటుందో ఆ రైతన్నకే తెలుసు... చేను కోతకు వచ్చే సమయానికి ఈ రాకాసి తుఫాన్ కారణంగా రైతు ఆవేదన అంతా ఇంతా కాదు. ఈ రైతు దుఃఖాన్ని ఎవరు ఆపగలరు. ఈ రైతును ఎవరు ఓదార్చ గలరు. రేపు మాకు పంట చేతుకు వస్తుంది కదా అని... తన పిల్లలకు ఫీజులు కట్టొచ్చు కదా అని ఆ రైతు ఎదురు చూస్తూ ఉండగా... ఈ రాకాసి తుఫాన్ రైతును అతలాకుతలం చేసింది. పంటను నేలపాలు చేసింది. రైతు బోరున విలపిస్తున్నారు. ఎవరు ఆపగలరు ఈ రైతు బాధను... ఏ ప్రభుత్వం సహాయ పడగలదు.. రైతును రాజును చేస్తాం అనే మాట తప్ప రైతును ఆదుకునే ప్రభుత్వాలు లేవు.. ఈరోజు రైతులను చూస్తుంటే వాళ్ల బాధ అంతా ఇంతా కాదు. పంట మొత్తం నేల పాలు అయినది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే రైతులను ఆదుకొని పంట నష్టపరిహారం చెల్లించాలని కోరుచున్నాం.



## వర్షం వలన పట్టణంలోని లోతట్టు ప్రాంతాలు నీరు నిల్వకుండా చర్యలు

జయభేరి, దేవరకొండ :

దేవరకొండ నిన్న రాత్రి నుండి తుఫాన్ కారణంగా కూసుస్తున్న వర్షం వలన పట్టణంలోని లోతట్టు ప్రాంతాలైన షాలిబండ, గణేష్ నగర్, పాత రామాలయం, ముత్యాలమ్మ బజారు నందు నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టినట్లు మునిసిపల్ కమీషనర్ వై.సుదర్శన్ తెలిపారు. అయ్యప్ప నగర్, ముదిగొండ ఎక్స్ రోడ్ వద్ద నీరు నిలవడం వలన జెసిబి ద్వారా నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టినట్లు, అదేవిధంగా పాత రామాలయం దగ్గర కులడానికి ఉన్న పాత ఇండ్లను జెసిబి సహాయంతో ఇండ్లను నెలమట్టం చేయడం చేయించడం జరిగింది. 24గంటలు అందుబాటులో ఉండాలని అధికారులకు మరియు సిబ్బందికి ఆదేశాలు జారీ చేయడం జరిగింది. అదేవిధంగా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పట్టణంలో ఇంకా ఎక్కడైనా వర్షాల కారణంగా ఇబ్బందులు ఉన్నట్లైయితే 9885361336, 9618224224, 9705303143 నెంబర్లకు తెలియజేయాలని పట్టణ ప్రజలకు సూచించారు.

## ప్రభుత్వ పెన్షనర్స్ సేవాసదనం నిర్మాణ నిధికి విరాళం




జయభేరి, దేవరకొండ :

దేవరకొండ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం దేవరకొండ కార్యవర్గ సమావేశం నందు పెన్షనర్, సీనియర్ సభ్యులు ఒంటెద్దు బాస్కర్ రెడ్డి రిటైర్డ్ టీచర్ అధ్యక్షులు, కార్యదర్శి తాడిశెట్టి నరసింహ, అంకం చంద్రమౌళి లకు మొదటి అంతస్తు సమావేశ మందిరం నిర్మాణ నిధికి రూ. 10,100 విరాళం అందజేసినారు. ఈ సందర్భంగా అధ్యక్షులు, కార్యదర్శి మాట్లాడుతూ మిత్రులు అందజేస్తున్న ఆర్థిక సహకారం మరువలేనిది, త్వరలో మొదటి అంతస్తు పూర్తిచేసి వాడుకలోకి తెచ్చుటకు ప్రయత్నం జరుగుతుంది. దాతలు ముందుకు వచ్చి తాము ప్రకటించిన విరాళాలు అందజేస్తారని ఆశిస్తున్నాము అన్నారు. దాత భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ నాకు ఈ అవకాశం కల్పించిన దేవరకొండ పెన్షనర్స్ కార్యవర్గంనకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను అన్నారు. మా దేవరకొండ పెన్షనర్స్ సంఘం బాధ్యులు చాలా శ్రమపడి పనులు జరిపిస్తున్నారు అని ధన్యవాదములు తెలిపినారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి పంగనూరు లింగయ్య ,జిల్లా కార్యదర్శి కంచర్ల నారాయణ రెడ్డి,సహ అధ్యక్షులు గంగిడి దామోదర్ రెడ్డి, ఉపాధ్యక్షులు ఆకులపల్లి ఐజాక్, సంయుక్త కార్యదర్శి వనం బుచ్చయ్య,కార్యనిర్వాహక కార్యదర్శి మహమ్మద్ యూసుఫ్ షరీఫ్, ప్రచార కార్యదర్శి పగిడిమర్రి సత్యమూర్తి,అలంపల్లి శ్రీనివాసు,విజయ్, గోకికార్ ప్రభాకర్, తాడూరు సత్యం,లక్ష్మనాచారి తదితరులు పాల్గొన్నారు.

## మొదలకుంట గ్రామానికి నిలిచిపోయిన రాకపోకలు



జయభేరి, దేవరకొండ :

దేవరకొండ రాష్ట్రంలో కురుస్తున్నా మొందా తుఫాను ప్రభావం వల్ల దేవరకొండ మండలం శక్రుతండా గ్రామపంచాయతీ లోని మొదలకుంట తండా శక్రుతండా వాగు పొంగి పొర్లుతుంది మొదలకుంట వాసులకు ఎటు పోకుండా రాకపోకలు నిలిచిపోయాయి ఇలాగే కురిస్తే శక్రుతండాలో కూడా కొన్ని ఇండ్లు మునిగే అవకాశం ఉంది అందువలన అధికారులు స్పందించి తగిన చర్యలను చేయాలని కోరడం జరిగింది. మాజీ సర్పంచ్ శీత్యా నాయక్ వార్డు సభ్యులు మణి గ్రామ సభ్యులు తిరుపతి లచ్చిరాం మరియు తదితరులు ఆందోళన వ్యక్తం చేశారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి



జయభేరి, తుర్కపల్లి, అక్టోబర్ 28:

ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆలేరు మార్కెట్ కమిటీ చైర్మన్ అయినాల చైతన్య మహేందర్ రెడ్డి అన్నారు. మంగళవారం తుర్కపల్లి మండలం పిఏసిఎస్ ఆధ్వర్యంలో ముల్కలపల్లి, పెద్దతండ, ఐకెపి ఆధ్వర్యంలో తుర్కపల్లి, వెంకటాపురం, దత్తాయపల్లి, ఇబ్రహీంపురం, గంధమల్ల, వాసాలమర్రి, పల్లెపహాడ్, చిన్నలక్ష్మాపురం గ్రామాల్లో దాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దళారులను నమ్మి రైతులు మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన దాన్యం కొనుగోలు కేంద్రాల్లోని రైతులు ధాన్యాన్ని మంచి ధరను పొందాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ దేశ నాయక్, డైరెక్టర్ పట్టు నాయక్, పిఏసిఎస్ వైస్ చైర్మన్ ముత్యాలు, మాజీ ఎంపీటీసీలు సంతోష, భాస్కర్ రెడ్డి, వనజ హనుమంత రెడ్డి, మండల వ్యవసాయ అధికారిని ఉమా, ఏఈవోలు, పంచాయతీ కార్యదర్శులు, పిఏసిఎస్ సీఈవోలు నారా రమేష్, బోరెడ్డి జనార్దన్ రెడ్డి, ఏపిఎం రమణ, మండల సమైక్య అధ్యక్షురాలు, సీసీలు, గ్రామ సంఘ బంధం అధ్యక్షులు, విబికేలు, గ్రామ శాఖ అధ్యక్షులు, వివిధ పార్టీల నాయకులు, కొనుగోలు కేంద్రాల ఇన్చార్జులు, గ్రామాల రైతులు పాల్గొన్నారు.



## శ్రీ ధ్యాన ఆంజనేయ స్వామివారి విగ్రహ ప్రతిష్ఠ కు ఆహ్వానం

జయభేరి, దేవరకొండ :

దేవరకొండ మున్సిపల్ 18 వార్డులో శ్రీ ధ్యాన ఆంజనేయ స్వామి వారి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం కార్యక్రమానికి రావాల్సిందిగా కోరుతూ TRP పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు MLC తీన్మార్ మల్లన్నని ఆహ్వానించిన 18 వ వార్డు మాజీ కౌన్సిలర్ V. అంజి గౌడ్ మరియు కాలనీ వాసులు.

## నేనావత్ కిషన్ నాయక్ ను సన్మానించిన ఆలయ కమిటీ సభ్యులు

- శ్రీ ఆంజనేయ స్వామి ఆలయ నిర్మాణానికి నేనావత్ కిషన్ నాయక్ విరాళం



జయభేరి, దేవరకొండ :

రాష్ట్ర బీఆర్ఎస్ (BRS) పార్టీ నాయకులు, నేనావత్ కిషన్ నాయక్, తమ ఉదారతను చాటుకుంటూ, దేవరకొండ మండలం పర్శ తండ నిర్మాణంలో ఉన్న శ్రీ ఆంజనేయ స్వామి వారి ఆలయానికి ₹ 1,50,000/ (లక్షన్నర రూపాయల) భారీ విరాళాన్ని అందజేశారు. కిషన్ నాయక్ ఆలయ నిర్మాణానికి ఇంత పెద్ద మొత్తంలో విరాళం ఇవ్వడం పట్ల భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు హర్షం వ్యక్తం చేసినారు. ఆదర్శప్రాయమైన నిర్ణయం తమ రాజకీయ, సామాజిక బాధ్యతలతో పాటు, ధార్మిక కార్యక్రమాలకు కూడా ప్రాధాన్యత ఇస్తున్న నాయకుల నిర్ణయం ఎందరికో ఆదర్శప్రాయంగా నిలిచింది. ప్రజా నాయకులు కిషన్ నాయక్ ప్రజలకు చేస్తున్న సేవలు అభినందనీయం, ఆయన భగవంతుడి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని భక్తులు కోరుకున్నారు. ఈ సందర్భంగా, ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక ప్రజలు కిషన్ నాయక్ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తూ, వారి సేవానిరతిని కొనియాడారు. భగవంతుడి సేవలో నాయకులు భాగం కావడం సమాజానికి మరింత మేలు చేకూరుస్తుందని తెలియజేసినారు.

## ప్రతి బాధితుడిని ఆదుకుంటాం

- మంత్రి అచ్చెన్నాయుడు

జయభేరి, అమలాపురం:

అంబేద్కర్ కోనసీమ జిల్లా జిల్లాలో 20 వేల ఎకరాల వరిపంట నష్టం జరిగింది. శ్రీకాకుళం నుండి తిరుపతి వరకు తుఫాను ప్రభావం కలిగిన రైతులను ఆదుకోవడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని జిల్లా ఇంచార్జ్ మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. బుధవారం అయన మీడియాతో మాట్లాడారు. ప్రతీ జిల్లా కి ప్రత్యేక అధికారులను నియమిచి ప్రతి గ్రామానికి అధికారులను నియమించి ఏ విధమైన ప్రాణ నష్టం కలగకుండా చూసాము. మత్స్యకారుల ప్రతి కుటుంబానికి 50 కేజీల బియ్యాన్ని పంపిణీ చేస్తాము. ఆక్వా, హార్టికల్చర్, వ్యవసాయ రంగాల్లో ఏవిధంగా నష్టం జరిగింది అని క్షేత్ర స్థాయిలో పరిశీలించి కేంద్ర ప్రభుత్వనికి పంపి ప్రతి రైతును ఆదుకుంటామని అన్నారు. తుఫాను వల్ల నష్ట పోయిన ఏ రైతు ఆందోళన చెంద వద్దు ఇది రైతు ప్రభుత్వం. జిల్లాలో 300 కరంట్ స్తంభాలు నేలకొరిగాయి.25 ట్రాన్స్ఫార్మర్స్ ఫెయిల్ అయిన వి. యుద్ధ ప్రాతిపదికన పనిచేసి రెండు మూడు గంటల్లో అన్ని సబ్ స్టేషన్ నుండి విద్యుత్ సరఫరా చేస్తాము. జిల్లలో అన్ని రోడ్లు పై భారీ వృక్షాలు పడినప్పుడికి ట్రాఫిక్ అంతరాయం కలగకుండా తగిన చర్యలు తీసుకున్నామని అన్నారు.



# మాస్ అంటే ఆయనే గుర్తొస్తారు!

'మాస్ జాతర' చిత్రంతో దర్శకుడిగా పరిచయమవుతున్నారు రచయిత భాను భోగవరపు. రవితేజ కథానాయకుడిగా సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 31న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా బుధవారం దర్శకుడు భాను భోగవరపు విలేకరులతో ముచ్చటించారు. ఈ సినిమాలో రవితేజ రైల్వే పోలీస్ అధికారి పాత్రలో కనిపిస్తారని, క్రైమ్ నేపథ్యంలో సాగే ఈ కథలోని ఓ కొత్త పాయింట్ ఇంట్రెస్టింగ్‌గా అనిపిస్తుందని చెప్పారు. 'ఇది కల్పిత కథే అయినా దీనికోసం ఎంతో పరిశోధన చేశా. కొందరు రైల్వే పోలీస్ అధికారులను కలిసి వారు చూసిన క్రైమ్ ఇన్సిడెంట్స్ గురించి తెలుసుకున్నా. వాటి స్ఫూర్తితో ఈ కథ రాసుకున్నా. ఇందులో మాస్ అంశాలతో పాటు పుష్కలమైన వినోదం ఉంటుంది' అని భాను భోగవరపు తెలిపారు. ఈ చిత్రంలో శివుడు అనే ప్రతినాయకుడి పాత్రలో నవీన్‌చంద్ర కనిపిస్తారని, స్పెషల్ ఫొటోషూట్ చేసి ఆయన్ని ఈ పాత్రకోసం ఎంపిక చేశామని పేర్కొన్నారు. 'కథానాయిక శ్రీలీల ఇందులో పల్లెటూరి అమ్మాయి పాత్రలో కనిపిస్తుంది. కథలో ఆమె పాత్రకు చాలా ప్రాధాన్యత ఉంటుంది. మాస్ అంటే మొదట గుర్తొచ్చే పేరు రవితేజ. ఆయన కోసమే ఈ కథ రాశా. సినిమా టైటిల్‌ను కూడా ఆయనే పెట్టారు. విక్రమార్కుడు, క్రాక్ వంటి సినిమాల్లో రవితేజ పోలీస్ క్యారెక్టర్స్‌లో కనిపించారు. అయితే 'మాస్ జాతర'లో ఆయన పాత్ర చాలా కొత్తగా ఉంటుంది' అని భాను భోగవరపు చెప్పారు.

# కొత్త సినిమాకు గ్రీన్‌సిగ్నల్?



'కాంతార' ఫ్రాంఛైజీతో దేశవ్యాప్తంగా పాపులర్ అయ్యారు కన్నడ నటుడు, దర్శకుడు రిషబ్‌శెట్టి. స్వీయ దర్శకత్వంలో ఆయన నటించిన 'కాంతార: చాప్టర్ 1' చిత్రం దేశవ్యాప్తంగా 800కోట్లకు పైగా వసూళ్లతో దూసుకుపోతున్నది. ఈ నేపథ్యంలో రిషబ్‌శెట్టి నటించే తాజా సినిమాల అప్‌డేట్స్‌పై అందరిలో ఆసక్తి నెలకొంది. 'హనుమాన్' సీక్వెల్ 'జై హనుమాన్'లో రిషబ్‌శెట్టి కథానాయకుడిగా నటించబోతున్న విషయం తెలిసిందే. జనవరిలో ఈ సినిమా సెట్స్‌మీదకు వెళ్లనుంది. ఇదిలావుండగా.. రిషబ్‌శెట్టి మరో తెలుగు సినిమాకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారని తెలిసింది. అగ్ర నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై సూర్యదేవర నాగవంశీ ఈ చిత్రాన్ని నిర్మించబోతున్నారని, పీరియాడిక్ కథాంశమిదని, దీనికి 'ఆకాశవాణి' ఫేమ్ అశ్విన్ గంగరాజు దర్శకత్వం వహించే అవకాశముందని ఫిల్మ్‌నగర్ టాక్.

# మహేష్ బాబు మేనకోడలు..




నటశేఖర కృష్ణ నట వారసుడిగా పరిచయమైన మహేశ్‌బాబు ప్రస్తుతం టాలీవుడ్ సూపర్‌స్టార్‌గా వెలుగొందుతున్న విషయం విదితమే. త్వరలో ఆయన కుటుంబం నుంచి మరో స్టార్ రానున్నది. తానెవరో కాదు. మంజుల ఘట్టమనేని గారాలపట్టి, సూపర్‌స్టార్ కృష్ణ మనవరాలు, మహేశ్‌బాబు మేనకోడలు అయిన జాన్వీ ఘట్టమనేని. ఇటీవల వెలుగు చూసిన జాన్వీ ఫొటోలకు సోషల్ మీడియాలో అద్భుతమైన స్పందన వస్తున్నది. త్వరలో తెరపై కనిపించనున్న అత్యంత అందమైన అమ్మాయిగా ఇండస్ట్రీ వర్గాలు ఆమెను కొనియాడుతున్నాయి. అందం, అభినయంతో పాటు పెయింటింగ్, డ్యాన్స్, ఫిట్‌నెస్, డ్రైవింగ్, గేమింగ్ ఇలా పలు రంగాల్లో ప్రతిభ కనపరుస్తున్నారు జాన్వీ. అందం, ప్రతిభ, వారసత్వమేలు కలయికగా జాన్వీని పలువురు అభివర్ణిస్తున్నారు. 'నన్ను అడ్డుకున్న వారే ఇప్పుడు జాన్వీ రాక కోసం ప్రార్థిస్తున్నారు. జాన్వీ చిరునవ్వు నా ప్రార్థనలకు సమాధానం' అన్నారు. తన తల్లి దర్శకత్వం వహించిన 'మనసుకు నచ్చింది' సినిమా ద్వారా పదేళ్ల వయసులోనే కెమెరా ముందుకొచ్చిన జాన్వీ.. తన సహజమైన నటనతో అందర్నీ ఆకట్టుకున్నది. త్వరలో ఈ ఘట్టమనేని అందం కథానాయికగా పరిచయం కానున్నది. దానికి సంబంధించిన వివరాలు త్వరలోనే వెలుగు చూడనున్నాయి.



# మీడియాలో సెగలు రేపేలా..

సీరియల్స్ లో నటించే చాలా మంది హీరోయిన్స్ కు మించిన అందంతో కట్టిపడేస్తున్నారు. సీరియల్స్ లో చీరకట్టులో యావరేజ్ గా కనిపించే ముద్దుగుమ్మలు సోషల్ మీడియాలో మాత్రం వారెవ్వా అనేలా తమ అందాలతో మతిపోగొడుతున్నారు. తాజాగా అలాంటి వయ్యారి ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. స్టార్ మా లో టెలికాస్ట్ అవుతున్న సీరియల్ చాలా ప్రేక్షకులను మెప్పిస్తూ మంచి రేటింగ్ తో దూసుకుపోతున్నాయి. అలాంటి సీరియల్స్ లో మల్లి సీరియల్ ఒకటి. ఆకట్టుకునే కథాంశంతో టెలికాస్ట్ అవుతున్న ఈ సీరియల్ కు మంచి ప్రేక్షాదరణ ఉంది. ఇక ఈ సీరియల్ లో నటించిన లాస్య తన నటనతో అందరి దృష్టిని ఆకర్షించింది. మల్లి సీరియల్‌లో పద్ధతికి చీర కట్టినట్లుగా ఉండే లాస్య బయట మాత్రం చాలా మోడ్రన్‌గా ఉంటుంది. ముఖ్యంగా సోషల్ మీడియాలో ఈ బ్యూటీ షేర్ చేసే ఫోటోలు మాములుగా ఉండవు. సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉండే లాస్య తన క్రేజీ ఫోటోలతో అభిమానులను కవ్విస్తుంది. ఈ అమ్మడి ఫోటోలు చూసిన నెటిజన్స్ సీరియల్ కు సోషల్ మీడియాలో ఇంత చేంజ్ ఏంటో.. అంటూ షాక్ అవుతున్నారు. ఈ అమ్మడు మోడ్రన్ డ్రస్సుల్లో ఫోటోలు వదిలింది. తాజాగా అదిరిపోయే డ్రస్ లో వారెవ్వా అనిపించేలా ఫోటోలకు ఫోజులిచ్చింది లాస్య. ఇన్ స్టా గ్రామ్ లో ఈ అమ్మడి 2లక్షలకు పైగా ఫాలోవర్స్ ఉన్నారు. ఇక ఈ ముద్దుగుమ్మ లేటెస్ట్ పిక్స్ పై మీరూ ఓ లుక్కేయండి.

# శ్రీలంకలో ఫుల్ స్వింగ్‌లో 'పెద్ది' షూటింగ్ .. ఆ లోకేషన్‌లో షూటింగ్ వెనక కారణం ఏంటి?




గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న ప్యాన్ ఇండియా ప్రాజెక్ట్ 'పెద్ది'పై ప్రేక్షకుల్లో అంచనాలు ఆకాశాన్ని అంటుతున్నాయి. 'ఉప్పెన'తో సెన్సేషన్ సృష్టించిన బుచ్చిబాబు సానా దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమా ఇప్పటికే భారీ క్రేజ్ సంపాదించుకుంది.తాజా సమాచారం ప్రకారం, 'పెద్ది' టీమ్ ప్రస్తుతం శ్రీలంకలో కీలకమైన షెడ్యూల్‌లో బిజీగా ఉంది. అక్కడ రామ్ చరణ్ - జాన్వీ కపూర్ జంటపై ఓ అందమైన పాటను చిత్రీకరిస్తున్నారు. ఈ పాటకు ఆస్కార్ విన్నర్ ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తుండటంతో, ఇది విజువల్‌గా, మ్యూజికల్‌గా గ్రాండ్ ట్రీట్‌గా మారబోతోందని ఫిల్మ్‌నగర్ టాక్. రామ్ చరణ్ కూడా ఇటీవల శ్రీలంక బయలుదేరుతుండగా ఎయిర్‌పోర్ట్‌లో కనిపించారు.

ఇంతలో, శ్రీలంక లొకేషన్స్ నుంచి కొన్ని ఆసక్తికరమైన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. డైరెక్టర్ బుచ్చిబాబు సానా, సినిమాటోగ్రాఫర్ రత్నవేలు కలిసి దిగిన ఫోటోలు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. ఆ ఫోటోల్లో ఇద్దరూ ఒక పాత రైల్వే ట్రాక్ టన్నెల్ ముందు నిలబడి ఉన్నారు. ఈ లొకేషన్ చూసి ఫ్యాన్స్‌లో ఆసక్తికరమైన చర్చ మొదలైంది. ఇది కేవలం సాంగ్ కోసం మాత్రమేనా? లేక సినిమాలో కీలకమైన యాక్షన్ లేదా ఎమోషనల్ సీక్వెన్స్‌కు సంబంధించిందా? అని ముచ్చటించుకుంటున్నారు. ఆ టన్నెల్ బ్యాక్‌డ్రాప్ సినిమాకు ప్రత్యేకమైన భావోద్వేగ టచ్ ఇస్తుందని అంచనా.

రత్నవేలు వంటి టాప్ సినిమాటోగ్రాఫర్ ఈ ప్రాజెక్ట్‌లో ఉండటంతో, విజువల్స్ నెక్స్ట్ లెవల్‌లో ఉంటాయని ఫ్యాన్స్ నమ్మకం. బుచ్చిబాబు, రత్నవేలు ఇద్దరి కాంబినేషన్ పిక్స్ ఆ అంచనాలను మరింత పెంచాయి. మొత్తానికి, 'పెద్ది' టీమ్ శ్రీలంకలో ఫుల్ స్వింగ్‌లో షూటింగ్ జరుపుకుంటోంది. విలేజ్ స్పోర్ట్స్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ సినిమాలో చరణ్‌ను మల్టిపుల్ లుక్స్‌లో చూడబోతున్నారని టాక్. 2026 మార్చి విడుదల లక్ష్యంగా సినిమా శరవేగంగా షూటింగ్ పూర్తి చేసుకుంటోంది. ఈ చిత్రంతో రామ్ చరణ్ క్రేజ్ మరింత పెరగడంఖాయం అంటున్నారు.

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at Hamara Warangal Printers and Graphics, # 25-8-182, Babuji Nagar, Kazipet, Warangal, Telangana - 506003. Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889. PRGI No: TGTEL/25/A0314.** email: **jayabherinews@gmail.com, www.jayabheridaily.com**